ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

శనివారం 16 నవంబరు 2024

సర్వేను విజయవంతం చేయాలి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కె.గంగాధర్ కోరారు. శుక్రవారం చౌటుప్పల్‌లో సర్వేను పరిశీలించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. ఎలాంటి అపోహలకు గురికావద్దని, ఎన్యూమే టర్లు సేకరించిన సర్వే గోప్యంగా ఉంటుందని, ఎవరికీ ఎలాంటి నష్టం జరగ దన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి, ఎంపీడీవో యాకుబ్‌నాయక్, ఎంపీవో అంజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్తీక శోభ



భువనగిరిలో కార్తీక దీపం వెలిగిస్తున్న చిన్నారి

● వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం వైభవంగా కొనసాగాయి. ఉదయం నుంచే మహిళలు శైవక్షేత్రాలకు వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రివేళల్లో మహిళలు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు. యాదగిరి గుట్టతోపాటు బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్ గ్రామంలోని అక్కన్న మాదన్న ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

8



యాదగిరిగుట్టలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు



వలిగొండ మండలం సంగెం భీమలింగేశ్వరుడి వద్ద భక్తుల సందడి

న్యూస్ బాక్స్

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



శంకుస్థాపన చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోరారు. సంస్థాన్‌నారాయణపూరం మండలంలోని జనగాం గ్రామంలో రూ.5లక్షలతో నిర్మించతలపెట్టిన అంబేడ్కర్‌భవన్ ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అయ్యే నిధులను కూడా పూర్తిగా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంచాల రాజేశ్వరి, దశరథ, మంచాల గాలయ్య, నరసింహ, జంగయ్య, ఏసు, గడ్డం రవి, కప్పల నరసింహ, లోడ రవి, శంకరయ్య, కాలేక్, సైదులు, లక్ష్మయ్య బక్కతట్ల వెంకటేష్, నాతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఉపేందర్‌రెడ్డి

భువనగిరి గంజ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని టీజేఏసీ జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు రెండో రోజు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్ అధ్యక్షతన జరిగింది. శుక్రవారం పుస్తక పదర్శనను ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలు నిరుద్యోగ యువతీ, యువకులకు ఎంతో ఉపయోగపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, కౌన్సిలర్ కిరణకుమార్, పింఛనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆర్ ఆనందం, రిటైర్డ్ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, చంద్రయ్య, మాటూరు బాలేశ్వర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● ఆస్ట్రేలియా దేశస్థుడు కొలిస్టార్

ఆలేరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆస్ట్రేలియా దేశస్థుడు జన్‌రన్ అద్రు కొలిస్టార్, పీవీ నర్సింహారావు మెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శర్బణాపురంలో పాల పదార్థాల తయారీపై ఆస్ట్రేలియా అల్యూమిని గ్రాన్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకోవా, నెయ్యి, పన్నీరు తయారీపై అవగాహన కల్పించారు. మహిళలు స్వయం ఉత్పత్తి దిశగా రాణించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, పాల సంఘం చైర్మన్ పరుశరాములు, మాజీ సర్పంచ్ సూదగాని సత్యరాజయ్య, రాజు, ఆలేరు పాల కేంద్రం మేనేజర్ చైతన్య, పాల్గొన్నారు.

బోనస్ లాస్



నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని మిల్లుల వద్ద బారులు తీరిన సన్నధాన్యం లోడు ట్రాక్టర్లు

సన్నధాన్యం విక్రయాల్లో రైతులకు అన్యాయం జరుగుతోంది. పచ్చివడ్లు కొంటున్నామనే నెపంతో మిల్లర్లు కనీస మద్దతు ధరకే పరిమితమవడంతో గతేడాది వచ్చిన ధర సైతం పొందలేకపోతుంటే, మరోవైపున మిల్‌పాయింట్ల వద్ద విక్రయిస్తుండటంతో ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ కోల్పోతున్నారు. సన్నరకాల బియ్యానికి బహిరంగ మార్కెట్లో బాగా గిరాకీ ఉన్నప్పటికీ ఆ రకం ధాన్యానికి మాత్రం కనీసమద్దతు ధరకు మించి ధర దక్కడం లేదు.

● బోనస్ కోల్పోతున్న ధాన్యం రైతులు
● సన్న రకాలన్నింటినీ మిల్లులకు తరలిస్తున్న రైతులు
● ప్రభుత్వ కేంద్రాలు వెలవెల
● కనీస ధరతోనే సరిపెడుతున్న మిల్లర్లు

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఈ సీజన్‌లో సన్నరకాల ధాన్యమంతా మిల్లులకే వస్తుండడంతో ధరను కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,320 నుంచి గరిష్ఠంగా రూ.2,450కు మించి కొనడం లేదు. గతేడాది ఇదే సీజన్‌లో ఇవే రకం సన్న ధాన్యానికి క్వింటాకు కనీసం రూ.2,600 నుంచి రూ.2,800 వరకు ధర ఇచ్చిన మిల్లర్లు, ఈసారి ధాన్యం ఎక్కువగా వస్తుండడంతో ధర పెరగకుండా నియంత్రిస్తున్నారు. మిర్యాలగూడ డివిజన్‌లో విస్తరించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రైస్‌మిల్లులకే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు తమ సన్నధాన్యం తీసుకువస్తుండటాన్ని ఆసరాగా చేసుకుని ధర పెరగకుండా నియంత్రిస్తున్న పరిస్థితి నెలకొంది.

ధరను నియంత్రిస్తోన్న మిల్లర్లు

ఈ వానాకాలం సీజన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మెట్టప్రాంతాల్లో బోరుబావుల కింద, నాగార్జునసాగర్ ఆయకట్టు కింద కలిపి 12.68లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, మొత్తం 29.28 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనావేశారు. ఇందులో సన్న ధాన్యం 16.08లక్షల మెట్రిక్‌టన్నులు కాగా, 13.20లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం వస్తుంది. సన్నధాన్యం అత్యధికంగా సూర్యాపేట జిల్లా నుంచి 9లక్షల మెట్రిక్ టన్నులు, నల్లగొండ జిల్లా నుంచి 6.40లక్షల మెట్రిక్‌టన్నులు, యాదాద్రి జిల్లా నుంచి 70వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తవుతుంది. మొత్తం 16.10లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్నధాన్యం వస్తుందని, ఈ ధాన్యమంతా మిల్లు పాయింట్లకే రానుందనే ధీమాతో మిల్లర్లు ధరను నియంత్రిస్తున్నారు. కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,320 కాగా అంతకుమించి కొద్దోగొప్పో ఇస్తూ గరిష్ఠంగా క్వింటాకు రూ.2,450 వరకు ఇస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటాకు రూ.2,600, రూ.2,800 వరకు ధర ఇచ్చారని, అదే రకం ధాన్యం, అదే స్థాయి నాణ్యతా ప్రమాణాలు ఈసారి కూడా పాటిస్తున్నప్పటికీ ధర ఎందుకు తగ్గిస్తున్నారని రైతులు నిలదీస్తే తేమ శాతం 17వరకే ఉండాలని, అలాంటిది పచ్చివడ్లు

మిగతా 6వ పేజీలో

తేమ తెస్తున్న తంటా

● రైతులకు సమస్యగా మారిన నిబంధన



6

ధర సన్నబడుతోంది

● సిండికేట్‌గా మారిన మిల్లర్లు



రైతు నెత్తిన ధరల పిడుగు

● పెరిగిన విత్తన, ఎరువుల ధరలు



యాసంగి సాగుకు సమాయత్తమవుతున్న రైతు నెత్తిన ధరల పిడుగుపడింది. ధాన్యానికి గత సంవత్సరంకన్నా ఈసారి ప్రభుత్వ మద్దతు ధర రూ.117 పెరిగింది. ఆ కొద్దిపాటి పెంపు తమకు గిట్టుబాటు కాదని రైతులు పేర్కొంటుండగా, గతేడాది కన్నా ఈసారి కూలీలు, దున్నకాల ఖర్చులు పెరిగాయి. తాజాగా యాసంగిలో విత్తనాలు, ఎరువుల ధరలు భారీగా పెంచి ప్రభుత్వాలు రైతులను మరింత ఇబ్బందులకు గురిచేశాయి. ఇప్పటికే వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదంటున్న రైతులు పెరిగిన ధరలతో అప్పుల పాలు కావాల్సిందేనంటున్నారు.

● మోత్కూరు-ఆంధ్రజ్యోతి

యాసంగి సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి ఈ నెల 20న అశ్విని కార్తె ప్రారంభమవుతుంది. రైతులు ఈ కార్తె ప్రారంభంనుంచి డిసెంబరు 10 వరకు వరి నారు పోస్తారు. యాసంగిలోవరినార్లు పోయడం ప్రారంభమవుతుండటంతో హైబ్రీడ్ వంగడాల వరి విత్తనాల మిగతా 7వ పేజీలో..

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

● రైతులు ఎలాంటి అపోహలకు గురి కావొద్దు ● కలెక్టర్ హనుమంత రావు



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి అపోహలకు గురి కావద్దని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం నందనం ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 372 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 9302 మంది రైతుల నుంచి 97812 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 88,845 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు అందచేసినట్లు వివరించారు. మొత్తం రూ.226కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి ఇప్పటి వరకు రూ.76కోట్లను 3,046మంది రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్ఐ జక్కుల భద్రయ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వసతులతో గ్రూప్-3 పరీక్ష కేంద్రాలు

గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని వసతులు కల్పించి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భువనగిరి శివారులోని దివ్యబాల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించి వసతుల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

● బీబీనగర్: ఇంటింటి సర్వే జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇళ్లకు తాళాలు వేయకుండా సర్వే సమయానికి అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలని కలెక్టర్ హనుమంతరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలో ఇంటింటి సర్వే తీరును పరిశీలించారు. కలెక్టర్ సర్వే సిబ్బందితో నేరుగా సోమ ముత్యాలు ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలను నమోదుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ధాన్యం కొనుగోలు, ఇంటింటి సర్వే రెండు ప్రధాన అంశాలపై దృష్టి సారించామని అధికార యంత్రాంగం కూడా వాటిపైనే నిమగ్నమై ఉందన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగం, ఉపాధి, సంక్షేమ రంగాల్లో ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే చేపడుతుందన్నారు. ప్రజలు ఇళ్లకు తాళాలువేసి పెట్టకుండా ఎన్యూమరేటర్లు సర్వేకు వచ్చే సమయానికి అందుబాటులో ఉండేలా సహకరించాలన్నారు. గురువారం నాటికి జిల్లావ్యాప్తంగా 38శాతం సర్వే పూర్తి కాగా శుక్రవారం నాటికి 42నుంచి 45 శాతానికి చేరుకోనుందన్నారు. మొదట్లో ఒక్క ఇంటి వివరాలు సేకరించడానికి గంట సమయం పట్టేదని, ఇప్పుడు 20నుంచి 30నిమిషాల సమయంలో పూర్తి చేస్తున్నారని, అందుకు ప్రజలు సర్వే సిబ్బంది తమ ఇళ్లకు వచ్చే సమయానికి ముందుగానే ఆధార్, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం సిద్ధంగా ఉంచుకున్నట్లయితే సర్వే తొందరంగా పూర్తవుతుందన్నారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● భువనగిరి (కలెక్టరేట్): దళితుల విషయంలో రాజ్యాంగం ప్రకారం వచ్చే హక్కులను అమలయ్యేలా చూడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, కలెక్టర్ హనుమంతరావును కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్‌ను కలిసి ఘనంగా సత్కరించారు.

గిరిజన జాతి ఆత్మగౌరవం ఆబా భగవాన్

● గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట ● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, పక్కన కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆశాజ్యోతి దర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా అని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో దర్తి ఆబా భగవాన్ 150వ జయంతి వేడుకలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ గిరిజనులకు ఉన్న ప్రత్యేక రిజర్వేషన్‌తో విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని వాటిలోనే చదువుకోవడం శ్రేయస్కరమన్నారు. అన్ని రంగాల్లో ప్రభుత్వం గిరిజనులకు పెద్దపీట వేసిందని, గిరిజనులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను జిల్లాస్థాయి అధికారులు సందర్శించి పిల్లల భోజనం, సదుపాయాలు తనిఖీ చేయాలన్నారు. సమాజంలో జరిగే ఘటనలపై గిరిజన పిల్లలకు అవగాహన కల్పించి చదువే ధ్యేయంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బిర్సా ముండా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. అదేవిధంగా చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో కూడా నైపుణ్యం చూపాలని, క్రీడలు మానసిక, శారీరక ఇబ్బందులు కలగకుండా చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గిరిజన అభివృద్ధి నాగిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్, డీఈవో సత్యనారాయణ, ఏఎల్‌డీఎం రామకృష్ణ, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం నీటితో చెరువును నింపాలి'

భువనగిరి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కొండ పోచమ్మ రిజర్వాయర్ నుంచి మండలంలోని వడపర్తి ఆగా చెరువును నింపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుల దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం భువనగిరి మండలం వడపర్తి ఆగా చెరువును రైతులతో పరిశీలించి మాట్లాడారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో సమీప ప్రాంతాల్లోని బోర్లు, బావులు ఎండిపోయాయన్నారు. బోర్లు పెట్టి ఒక్క మడిని నీళ్లతో నింపడానికి నాలుగు రోజుల సమయం పడుతుందని, ఆయా గ్రామాల్లో సాగునీటితోపాటు తాగునీటికోసం అవస్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాళేశ్వరం నీటితో చెరువును నింపితే సుమారు 10 గ్రామాల ప్రజలకు సాగు, తాగు నీటి బాధలు తప్పుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాండాల మైసయ్య, ఎ రమేశ్, ఎ లింగారెడ్డి, కొండల్, మల్లయ్య, అంజిరెడ్డి, అయిలయ్య, యాదయ్య భిక్షపతి, మల్లేశ్ పాల్గొన్నారు.



చక్రతీర్థస్నానం చేయిస్తున్న అర్చకులు

మత్స్యగిరీశుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

వలిగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శుక్రవారం చక్రతీర్థం, యాగశాలలో మహా పూర్ణాహుతి పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. దేవతోద్వాసనం, శ్రీ పుష్పయాగ ద్వాదశారాధన, ధ్వజారోహణం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మత్స్యగిరిస్వామి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అయ్యాయి.

చక్రతీర్థ మహోత్సవం

బ్రహ్మోత్సవాల్లో కన్నుల పండువగా సాగే పర్వమే చక్రతీర్థ మహోత్సవం. ఉగ్రనారసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. మండపంలో శాస్త్రోక్త పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల నడుమ స్వామికి స్నానఘట్టాలు నిర్వహించారు. ఆ పుణ్యజలాన్ని బాజాభజంత్రీల నడుమ వైభవంగా రుత్వికులు మంత్రోచ్చరణలతో స్వామివారి పుష్కరిణిలో కలిపారు. పసుపు, కుంకుమ, గంధం, సుగంధ పరిమళాలు వెదజల్లి సేవోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో మోహన్ బాబు, చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు, రుత్వికులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

దేవతోద్వాసనం

బ్రహ్మోత్సవాలను తిలకించడానికి రుత్వికులు 33కోట్ల దేవతలను ఆహ్వానించారు. ముగింపు నేపథ్యంలో రాగతాళాలతో వారిని సంతృప్తి పరిచిన అనంతరం వారి స్వస్థలాలకు భక్తి పూర్వకంగా చేర్చే ప్రక్రియ దేవతోద్వాసనం. అర్చకులు ఈ తంతును శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తిశ్రద్ధల నడుమ పుష్పయాగం నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతాల్లో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రక్తదానంతో.. ప్రాణదానం

ప్రతీ రోజు ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో అనేక మంది మృత్యువాత పడుతుండటంతోపాటు తీవ్ర గాయాలపాలై పెద్ద ఎత్తున రక్తస్రావం అవుతోంది. అంతేకాకుండా గర్భిణులకు ప్రసవ సమయంలో రక్తం అధికంగా పోతుంది. ఇలాంటి సమయాల్లో ప్రాణాపాయం సంభవించే పరిస్థితి నెలకొంటుంది. ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో ముఖ్యం. అప్పటికప్పుడు రక్తం అందించాలంటే చాలా కష్టం. అందుకోసం గతంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటుచేశారు. కొన్నాళ్లపాటు ఆ సొసైటీనే బ్లడ్‌బ్యాంక్ నిర్వహణను చేపట్టింది. సుమారు ఏడేళ్లుగా బ్లడ్ బ్యాంక్ నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. రక్తం అవసరమైన వారికి దీని ద్వారా రక్తాన్ని అందిస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. అయితే పలు సందర్భాల్లో రక్తం లభించడంలేదు. అందుకు కారణం రక్తదానం చేసే ప్రజలు లేకపోవడం సమస్యగా మారింది. అనేక మంది, స్వచ్ఛంద సంస్థలు ఆయా సందర్భాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వివిధ రకాల గ్రూపులకు సంబంధించిన రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంక్‌లకు అందజేసేవారు. కానీ తాజాగా రక్తదాన శిబిరాల సంఖ్య తగ్గింది. ఈ ప్రభావం బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తం నిల్వలపై చూపుతోంది. దీంతో ఆపద సమయంలో రక్తం అవసరమైన వారికి రక్తం అందటం ఇబ్బందిగా పరిణమిస్తోంది.

అందుబాటులో ఉండని పలు గ్రూపుల రక్తం

సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో అన్ని రకాల గ్రూపులకు సంబం ధించిన రక్తం అందుబాటులో ఉండడంలేదు. ముఖ్యంగా నెగిటివ్ గ్రూపులకు సంబంధించిన రక్తం నిల్వ ఉండడం లేదు. అంతేకాకుండా పాజిటివ్ గ్రూపులకు సంబంధించిన రక్తం మాత్రం నిల్వ ఉంటుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ రక్తం అవసరమైన వారికి మాత్రం ఉచితంగా రక్తాన్ని అందజేస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ రక్తం అవసరమైన వారికి మాత్రం ప్యాకెట్‌కు రూ.1100 చొప్పున తీసుకుంటూ రక్తం ఇస్తున్నారు. ఇద్దరు దాతలు రక్తం ఇస్తే ఒక ప్యాకెట్ రక్తాన్ని ఉచితంగా ఇస్తున్నారు. అత్యవసర సమయంలో అన్ని గ్రూపులకు సంబంధించిన రక్తం మాత్రం సూర్యాపేట బ్లడ్ బ్యాంక్‌లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చు. ప్రసవ సమయంలో రక్తం అవసరమైన వారు కూడా వారి బంధువులద్వారా రక్తదానం చే యించాలి. నెగిటివ్ గ్రూపులకు సంబంధించిన రక్తం లభించడం కష్టంగా ఉంది. ఏడాదిలో రెండు సార్లు రక్తదానం చేస్తే ఆ రో గ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగవు. ప్రస్తుతం నెగిటివ్ గ్రూ పులు మినహా మిగిలిన పాజిటివ్ గ్రూపులకు సంబంధించిన రక్తం నిరంతరం అందుబాటులో ఉంచుతున్నాం.

అశోక్, సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి

రక్తదానం మహాదానం. కానీ అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక ఎంతో మంది మృతి చెందుతున్నారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునే వారు కూడా దేవునితో సమానం. బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు లేక సరైన సమయంలో రక్తం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రక్తదాన అవశ్యకతపై అవగాహన కల్పించాల్సి ఉండగా ఆ దిశగా ప్రయత్నాలు చేయడంలేదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, యువత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారే తప్ప మిగిలిన వారు నిర్వహించడం లేదు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట కలెక్టరేట్)

● బ్లడ్ బ్యాంకుల్లో అందుబాటులో ఉండని అన్ని గ్రూపుల రక్తం

సకాలంలో రక్తం అందక ఇబ్బందులు

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, ఆయా ఘటనల్లో గాయపడిన వారికి అవసరమైన రక్తం లభించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సకాలంలో క్షతగాత్రులకు అవసరమైన రక్తాన్ని అందిస్తే వారి విలువైన ప్రాణాలు కాపాడే అవకాశం ఉంది. రక్తం అందక వైద్య చికిత్సలు చేయలేక ఎంతోమంది ప్రాణాలు వదులుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా పరిధిలో 65వ జాతీయ రహదారి, ఖమ్మం రోడ్డు, జనగాం రోడ్డు, దంతాలపల్లి రోడ్డుతో పాటు కోదాడ, మిర్యాలగూడెం రహదారులపై నిత్యం ఏదో ఒక చోట అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడాదిలో సుమారు 300 మందికిపైగా మృతి చెందుతున్నారు. మరో 800 మంది వరకు గాయపడుతున్నారు. జిల్లాలో కోదాడ, హుజుర్‌నగర్, తుంగతుర్తి నియోజక వర్గకేంద్రాల్లో ప్రభుత్వం బ్లడ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రక్తం లభించకపోవడంతో హైద్రాబాద్‌లోని బ్లడ్ బ్యాంక్‌ల నుంచి రక్తాన్ని తీసుకువస్తున్న సంఘటనలు అనేకం ఉంటున్నాయి. ప్రతి ఏడాది అక్టోబరు 21న పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా మాత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదానం చేసి సుమారు 200 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకుకు అందచేస్తున్నారు.

ఐదువేల యూనిట్ల సేకరణ



రెడ్‌క్రాస్ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి 70 రక్తదాన శిబిరాలు నిర్వహించి ఐదు వేల యూనిట్లకు పైగా రక్తం సేకరించారు. రాష్ట్రంలో అత్యధికంగా రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు గాను ఆయన రెండు సార్లు గవర్నర్ నర్సింహం చేతుల మీదుగా, మరో రెండు సార్లు గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఆయన రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. నూతనంగా యాదాద్రి జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఆయన జిల్లా చైర్మన్‌గా పని చేస్తున్నారు. ఆయన జిల్లా చైర్మన్‌గా ప్రతి నెల ఏదో ఒక చోట రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు.

ఏడాదికోసారి 70 యూనిట్ల రక్తం సేకరణ

మోత్కూరు: సంఘాలు ఎక్కువ భాగం తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడటానికే పరిమితమవుతాయి. కానీ టీఎస్‌యూటీఎఫ్ మోత్కూరు తాలూకా యూనిట్ ప్రతీ సంవత్సరం రక్తదానం శిబిరం నిర్వహించి సామాజిక స్పృహను చాటుతోంది. రక్తం కృత్రిమంగా తయారు చేయలేం. రక్తనిల్వలు లేక, సకాలంలో రక్తం అందక ఎందరో మృత్యువాతపడుతుంటారు. రక్తదానం ఎందరి ప్రాణాలనో కాపాడుతుందని భావించిన యూటీఎఫ్ నాయకులు సామాజిక సేవలో భాగంగా ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 4న రెడ్‌క్రాస్ సహకారంతో మోత్కూరులో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో ఉపాధ్యాయులే ఎక్కువగా రక్తదానం చేస్తారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రతీ శిబిరంలో 50 నుంచి 70 యూనిట్ల రక్తం సేకరించి రెడ్‌క్రాస్ రక్తనిధికి ఇస్తున్నారు. యూటీఎఫ్ సుమారు పుష్కర కాలంగా ప్రతీ సంవత్సరం రక్తదాన శిబిరం నిర్వహిస్తోంది. సుబ్రమణ్యశర్మ అనే ఉపాధ్యాయుడు తను టీచర్‌గా ఉన్నప్పుడు, రిటైర్ అయ్యాక మొత్తం 59 సార్లు రక్తదానం చేశారు.

16ఏళ్లుగా రక్తదానం చేస్తున్నా



16 ఏళ్లగా రక్తదానం చేస్తున్నా. 2008లో మోతె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో గాయపడిన వారికి రక్తం అవసరం అయింది. ఆ సమయంలో రక్తం అందుబాటులో లేదు. అప్పుడు రక్తం ఇచ్చాను. నాటి నుండి నేటి వరకు 36 సార్లు రక్తదానం చేశాను. రెండేళ్లుగా సూర్యాపేట బ్లడ్ డోనర్స్ పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశాను. అందులో సుమారు 615 మందిని యాడ్ చేసి ప్రతి రోజు రక్తం అవసరమైన వారికి రక్తం అందిస్తున్నాను.

పాలవెల్లి రమేష్, హెడ్‌కానిస్టేబుల్ సూర్యాపేట.

మదర్ థెరిస్సా స్ఫూర్తితోనే..



అనాథలు, కుష్ఠురోగులకు మదర్‌థెరిస్సా అందించిన స్ఫూర్తితో కొన్నేళ్లుగా రక్తదానం చేస్తున్నాను. సినీహీరో చిరంజీవి పట్ల ఉన్న అభిమానంతో హైదరాబాద్‌లో చిరంజీవి ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంక్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తున్నాను. 1996నుంచే జిల్లాలో ఎవరూ నిర్వహించని విధంగా కోదాడ, మిర్యాలగూడ, సూర్యాపేటలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాను. ఇప్పటివరకు 30 సార్లు రక్తదానం చేయగా ఇతరుల ద్వారా 28వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు అందజేశాను. రక్తం అవసరమైన వారు సెల్:9849347444ను సంప్రదించాలి.

భైరు వెంకన్నగౌడ్, అఖిలభారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు, సూర్యాపేట.



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్(ఫైల్).

సూర్యాపేట జిల్లాలో మూడు బ్లడ్ బ్యాంకులు

సూర్యాపేట జిల్లా పరిధిలో మొత్తం మూడు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. అందులో ఒకటి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉండగా మరో రెండు సూర్యాపేట జిల్లా కేంద్రంలో, మరొకటి కోదాడలో ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. వీటి నుంచి ప్రతి రోజు వివిధ రకాల గ్రూపులకు సంబంధించిన 13 నుంచి 17యూనిట్ల రక్తం విక్రయిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే వారికి మాత్రం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అయితే యూనిట్‌కు రూ.1100 చొప్పున తీసుకుంటున్నారు. అదేవిధంగా డబ్బులు లేకుండా ఇద్దరు దాతలు రక్తం ఇస్తే ఒక యూనిట్ రక్తాన్ని ఉచితంగా అందిస్తున్నారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంకుల్లో అయితే యూనిట్‌కు రూ.2వేల వరకు తీసుకుంటున్నారు. డబ్బులకు విక్రయించే విషయంలో కంటే ఇతరుల నుంచి రక్తాన్ని సేకరించి ఉచితంగా రక్తం ఇచ్చేందుకే బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు మొగ్గు చూపుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో ప్రస్తుతం ఏబీ నెగిటివ్ గ్రూప్ మినహా మిగిలిన గ్రూపులకు సంబంధించిన రక్తం అందుబాటులో ఉంది.



పేటలోని బ్లడ్‌బ్యాంక్

జిల్లాలో బ్లడ్ బ్యాంకుల వివరాలు.	
	ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్: 9550952495
	సాయి బ్లడ్ బ్యాంక్, సూర్యాపేట: 6303255264
	తిరుమల బ్లడ్ బ్యాంక్, కోదాడ:7013236394

బోనస్ లాస్

(5వ పేజీ తరువాయి)

తేమ 26, 28 వరకు ఉంటున్నాయని, అందువల్లే ధర ఇవ్వలేకపోతున్నామని మిల్లర్లు చెబుతున్నారు. అయితే వాస్తవానికి గతేడాది సాగర్ ఆయకట్టుకు నీరు లేకపోవడం, అక్కడ వరి సాగు తక్కువగా ఉండడంతో పాటు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం 8 లక్షల మెట్రిక్‌టన్నులకు మించిరాలేదని, ఈసారి ఇందుకు దాదాపు రెట్టింపు ధాన్యం వస్తుండడంతో ధర పెరగకుండా సిండికేట్‌గా మారి కొనుగోళ్లు చేస్తున్నారనే చర్చ సాగుతోంది. అయితే మిర్యాలగూడ డివిజన్‌లో ప్రస్తుతం సన్నధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లుల్లో ఉన్న అత్యాధునిక సాంకేతికతతో ధాన్యం తేమశాతంతో సంబంధం ఉండదని, ఎంత పచ్చి ఉన్నప్పటికీ బాయిల్డ్ చేసే విషయంలో ఇబ్బంది రాకపోగా, పచ్చివడ్లయితేనే బియ్యం నూక శాతం తక్కువగా వస్తుందని, బియ్యపుగింజ విరగడం ఉండదని, ధర తగ్గించడం కోసమే, 17శాతం తేమ నిబంధనను మిల్లర్లు తెరమీదకు తెచ్చి రైతును దగా చేస్తున్నారని రైతులు, సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

వెలవెలబోతున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నల్లగొండ జిల్లాలో సన్నధాన్యం కొనుగోళ్లకు 81 కేంద్రాలు ఏర్పాటు చేసి పది రోజులు గడుస్తున్నా రైతులెవరూ ఇప్పటివరకు ఈ కేంద్రాలకు ధాన్యం తీసుకురావడం లేదు. ఈ కేంద్రాల్లో విక్రయిస్తేనే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ వస్తుంది. మిల్లుల్లో విక్రయిస్తే బోనస్ రాదని, తెలిసినా రైతులు పచ్చివడ్లు కొంటున్నారని, డబ్బులు వెంటనే చెల్లిస్తున్నారనే కారణాలతో మిల్‌పాయింట్ల వద్దనే నేరుగా ధాన్యం విక్రయిస్తున్నారు. నల్లగొండ జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లాలో పండిన సన్నధాన్యం కూడా దాదాపుగా మిర్యాలగూడ డి విజన్‌లో ఉన్న మిల్లుల వద్దకే తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగువేల ట్రాక్టర్ల ధాన్యం వస్తోంది. మరో పక్షం రోజుల వరకు ఇదే ఒరవడి కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం 1000 క్వింటాళ్ల వరకు కూడా రాలేదు. అయితే మిల్లులకు మాత్రం ఇప్పటివరకు దాదాపు 3లక్షల మెట్రిక్‌టన్నుల వరకు ధాన్యం వచ్చిందని చెబుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం కొనాలన్నా 17శాతానికి లోబడి తేమశాతం, గింజపొడవు 6మిల్లీమీటర్లకు లోబడి ఉండడంతో పాటు, తాలు, తేమ ఉండకూడదని చెబుతున్నారని, సన్నవడ్లను ఆరబెడితే తూకం తేడా వస్తుందని, అందువల్లే మిల్లులకు నేరుగా అమ్ముతున్నామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం సన్నధాన్యాన్ని రైతులు ఎక్కడ అమ్ముకున్నా వారికి బోనస్ ఇవ్వాలని నల్లగొండ జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతుసంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



నల్లగొండ జిల్లా వేములపల్లిలో ధాన్యం లేక వెలవెలబోతున్న సన్నధాన్యం కొనుగోలు కేంద్రం

మహేంద్ర చింట్లు రకం ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల పేచీలు

సన్నధాన్యమంతా మిల్లులకే వస్తుండడంతో వాటిల్లో మహేంద్ర చింట్లు రకం ధాన్యం కొనబోమని రైస్‌మిల్లర్లు పేచీ పెడుతున్నారు. ఈ రకం ధాన్యం మిల్లింగ్ తర్వాత వచ్చే బియ్యంలో వైట్ బెండ్(కొంత భాగం పిండిపదార్థం) ఎక్కువగా ఉంటుందని, తెల్లగీత వలె వస్తుందని, పిండిపదార్థం ఎక్కువగా ఉండడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడుతుందని మిల్లర్లు చెబుతున్నారు. అన్నం కూడా ముద్దగా మారుతుందని, అందువల్ల వినియోగదారులు ఈ బియ్యం కొనడానికి ఇష్టపడడం లేదని, మార్కెటింగ్‌లో ఇబ్బందుల వల్ల ఈ రకం ధాన్యం కొనలేమని మిల్లర్లు తేల్చిచెబుతుండడంతో మిల్లుల వద్ద ఈ రకం ధాన్యం తెచ్చేరైతులకు, మిల్లర్లకు మధ్య ఘర్షణ తలెత్తుతుంది. ఇదే రకం ధాన్యాన్ని గత రెండేళ్లుగా అధిక ధర ఇచ్చిమరీ కొన్నారని, ఇప్పుడెందుకు సాకులు చెబుతున్నారని మిల్లర్లని రైతులు నిలదీస్తున్నారు. ఈ విషయమై తాజాగా మిల్లర్లతో జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి నిర్వహించిన సమావేశంలోనూ చర్చకు రాగా, ఆమె సన్నధాన్యం ఏరకమైనా నాణ్యతగా ఉంటే కొనాల్సిందేనని సూచించడంతో ఈ ఒక్క సీజన్‌కు నాణ్యత ఉంటే కొంటామని మిల్లర్లు అంగీకరించారు. తేమ ఎక్కువ ఉందని, ఇతరత్రా సాకులు చెబుతూ ఈరకం ధాన్యానికి కనీస మద్దతు ధర క ంటే క్వింటాల్‌కు రూ.200 వరకు ధర తగ్గిస్తున్నారని, గత్యంతరం లేక ఇచ్చివెళుతున్నామని రైతులు చెబుతున్నారు.

తేమ తెస్తున్న తంటా

● మంచు కురుస్తుండటంతో పెరుగుతున్న తేమశాతం

సూర్యాపేట సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యంలో తేమ శాతం రైతులకు శాపంగా మారింది. మంచుకురిసే కాలం కావడంతో ఆరబోసిన ధాన్యంలో తేమ శాతం పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. తేమశాతం తగ్గే వరకూ కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించాల్సి వస్తోంది. పంటను ఇంటి దగ్గర ఆరబెట్టేందుకు సరైన స్థలం లేక రైతులు పొలం నుంచి పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే వాతావరణ పరిస్థితులకు తోడు ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో కొనుగోళ్లకు ఆలస్యమవుతోంది. దానికి తోడు ఉదయం సమయంలో మంచు కురుస్తుండటంతో కాస్తో, కూస్తో ఎండిన ధాన్యం కాస్తా మంచుకు తడిసిపోతోంది. సాయంత్రం ఒక రాశికి తేమశాతం 30వరకు ఉంటే అదే ధాన్యం ఉదయం 40గా సూచిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం 17 వరకు ఉండాలని ఆ విధంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామన్న నిబంధనతో ఎక్కువ మంది రైతుల ధాన్యం కాంటాలు కావడం లేదు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాత్రి సమయంలో అంధకారం నెలకొంది. కేవలం ఏదో ఒక్కచోట మాత్రమే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు విద్యుద్దీపాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

తేమ శాతమే ప్రధాన అడ్డంకి

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమశాతం నిబంధన ప్రధాన అడ్డంకిగా మారింది. తేమశాతం 17 వచ్చే వరకు ఎండబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్ లోడుతో ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు ఆ ధాన్యాన్ని పలుచగా పోయడం కోసం డోజర్లను ఉపయోగిస్తున్నారు. అందుకోసం గంటకు రూ.700 అద్దె చెల్లిస్తున్నారు. ఇలా ప్రతి గంటకు ఒక్కసారి ధాన్యాన్ని ఆరపోస్తున్నారు. కొనుగోళ్ల నిలిచి కేంద్రాల్లో ధాన్యం ఆరబోతలతో స్థలాభావం ఏర్పడుతోంది. దీంతో రాశులుగా పోసుకుంటున్నారు. రోజుకు మూడుసార్లు తేమశాతాన్ని పరిశీలించాల్సి ఉండగా చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కేవలం రెండుసార్లు మాత్రమే చూస్తున్నారు. దీనికి తోడు తేమశాతం తెలిపే యంత్రాలు సరిపోను లేకపోవడంతో అన్ని ధాన్యం రాశుల్లో తేమశాతం చూడటం లేదని రైతులు వాపోతున్నారు. తేమశాతం చూడాలని అధికారుల చుట్టూ తిరిగేతేనే చూస్తున్నారని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు.

తేమ శాతం లేకుండా కొనుగోళ్లు జరపాలి

తేమశాతం 17కంటే తక్కువగా ఉంటేనే కొనుగోళ్ల చేస్తుండటంతో రోజులకొద్ది రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఉదయం 10 గంటల వరకు చలిగాలితో కూడిన మంచు కురుస్తుండటంతో ధాన్యం పచ్చిగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం విక్రయించడానికి నాలుగు రోజుల వరకు పడుతుందని, ఇన్ని రోజులు ధాన్యం కేంద్రంలో ఉంటే ఇంటి దగ్గర పనులు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి 7గంటల నుంచి ఉదయం 10 వరకు మంచు కురుస్తోందని తద్వారా తేమశాతం తగ్గడం కష్టంగా మారుతోందని, అధికారులు తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తేమ చూడకుండా కొనుగోలు చేయాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం నిబంధన రైతులను చాలా ఇబ్బందులను కలుగచేస్తోంది. ఉదయం మంచు కురిసి తేమశాతం పెరుగుతోంది. ధాన్యంపై టార్పాలిన్లు కప్పినా తేమ తగులుతోంది. 17 శాతం తేమ నిబంధనను ఎత్తి వేయాలి. తేమశాతం తగ్గించడానికి రోజుకు నాలుగు సార్లు ధాన్యాన్ని ఆరబోస్తున్నాం. రోజులతరబడి కేంద్రాల్లో ఉంటే ఇతర పనులు, ఇంటి పనులను చూసుకోలేకపోతున్నాం. తేమ శాతం నిబంధన సరైంది కాదు.


వీరయ్య, పిన్నాయపాలెం గ్రామం, సూర్యాపేట మండలం.

మౌలిక సదుపాయలు కల్పిస్తున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, టెంటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. ఇప్పటికే నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. రాత్రి వేళల్లో కొనుగోలు కేంద్రాలలో వెలుగులు ఉండేలా విద్యుత్ లైట్లను అమర్చాలి. అన్ని కేంద్రాల్లో తేమశాతాన్ని తెలిపే యంత్రాలను అందుబాటులో ఉంచాం. నిబంధన మేరకు రోజుకు మూడుసార్లు తేమశాతం పరిశీలించారు. నిబంధనకు అనుకూలంగా ఉంటే వెంటనే కాంటాలు జరిపిస్తున్నాం. ధాన్యం తూర్పార పట్టే యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా నిర్వాహకులు రైతులకు అవగాహన పెంచాలి. తేమశాతం నిబంధన సడలింపు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.

డీ రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



యాదగిరీశుడి సన్నిధిలో కార్తీక వెలుగులు కాంతులీనుతున్నాయి. శుక్రవారం కార్తీక పౌర్ణమికి ఆలయాన్ని ముస్తాబు చేస్తుండగా.. ఆకాశంలో చంద్రుడి వెన్నెల భక్తులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు వెన్నెలలో సేదతీరి కాసేపు ఆనందంగా గడిపారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి

ధర 'సన్న'బడుతోంది

రైతుల పరిస్థితి మిల్లర్లకు వరంగా మారింది. నాగార్జునసాగర్ ఆయకట్టులో వానాకాలం సీజన్‌లో ఎక్కువగా సన్నాలను సాగు చేశారు. అయితే వారం రోజులుగా వాతావరణంలో మార్పులతో వరి కోతలు ముగియగానే ఉత్పత్తులను రైతులు మిల్లుల వద్దకు చేరుస్తున్నారు. దీనిని అలుసుగా తీసుకుంటున్న మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ ప్రాం తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపించడం లేదు.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

సాగర్ ఆయకట్టులో చింట్లు, సన్నాలు ఎక్కువ సాగు చేశారు. సుమారు రెండు లక్షల ఎకరాల్లో చింట్లు సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా మొత్తంలో చెరువులు, కుంటలు, కాల్వల కింద చేసిన సాగు విస్తీర్ణంలో 30శాతం వరి కోతలు ముగిశాయి. ఇందులో అధికశాతం సన్న ధాన్యం కావడంతో వరి కోతలు ముగిసిన వెంటనే పంటను సరాసరి మిల్లులకే తరలిస్తున్నారు. జిల్లాలో సుమారు 100 రైస్‌మిల్లులు ఉండగా వారంతా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. 8 మంది మిల్లర్లను డిఫాల్టర్లుగా ప్రకటించింది. ఇందులో 54మంది మిల్లర్లు సీఎంఆర్ ధాన్యంతో పాటు సొంతంగా కూడా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో కీలకమైన, ఎక్కువ ఆయకట్టు ఉన్న హుజూర్‌నగర్ డివిజన్‌లో పెద్దమొత్తంలో వరి సాగు చేసినప్పటికీ వాతావరణ పరిస్థితులకు తలొగ్గి కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయాలకు ఆసక్తి చూపించడం లేదు. ఇదే అదనుగా భావించిన మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లుల వద్దకు రైతులు పెద్ద మొత్తంలో ధాన్యం తీసుకురావడంతో క్వింటా ధాన్యం రూ.2,200 నుంచి రూ.2,300 వరకు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది మాత్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ.2,600 నుంచి రూ.2,700 వరకు కొనుగోలుచేశారు. ఈ ఏడాది క్వింటా రూ.300 నుంచి రూ.400 వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నా వాతావరణం మబ్బులు పట్టి ఉండడంతో రైతులలో గుబులు రేపుతోంది. మూడురోజులుగా వాతావరణం మబ్బులు ఉండడంతో తప్పని పరిస్థితులతో తక్కువ రేటుకే విక్రయిస్తున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో సాంబమసూరి, దొడ్డు రకాలు ఇంకా కోతలు కోయలేదు. నియోజకవర్గంలో సుమారు 35 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇందులో 25వేల హెక్టార్లలో సన్నాలే సాగు చేశారు. సన్న రకం ధాన్యం మొత్తం రైతులు మిల్లర్లకే విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో కనిపించని విక్రయాలు

సాగర్ ఆయకట్టులో జిల్లాలో సుమారు 2.5 లక్షల ఎకరాల పైనే వరి సాగు చేశారు. కోతలు ప్రారంభమై 10 రోజులు దాటింది. ధాన్యం కొనుగోలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారం కావస్తోంది. అయితే అవి ఏమాత్రం ఉపయోగం లేకుండాపోయాయి. హుజూర్‌నగర్ డివిజన్‌లో సుమారు 25 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా ఏ ఒక్క కేంద్రంలోనూ నేటికీ కనీసం కొనుగోలు చేయలేదు. ప్రభుత్వం జిల్లాలో 310 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 177 దొడ్డు రకాల ధాన్యం, 133 సన్న రకాల ధాన్యం కొనుగోళ్లకు కేటాయించింది. వీటి ద్వారా 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. హుజూర్‌నగర్ ప్రాంతంలోని 25 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఎలాంటి కొనుగోళ్లు జరగలేదని అధికారులు అధికారికంగా ప్రకటించారు. అంటే ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల వైపు రైతులు కన్నెత్తిచూడడం లేదు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.2,320, బోనస్ రూ.500లు ఇస్తున్నప్పటికీ రైతులు మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పట్టించుకోవడం లేదు.

అధికారులు సూచిస్తున్నా?

ఇదిలా ఉండగా సన్నా ధాన్యాలకు ఒక వైపు ప్రభుత్వం మద్దతు ధర, బోనస్ కలిపి రూ.2800 వరకు ఇస్తున్నామని ప్రకటించినా ముఖ్యంగా హుజూర్‌నగర్ వంటి ప్రాంతంలో కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు జరగడం లేదు. అదనపు కలెక్టర్ ఇటీవల హుజూర్‌నగర్‌లో పరిశీలన చేసినప్పుడు రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రైతులు ధాన్యం ఎండబెట్టుకుంటున్నారు. సన్నాలు, దొడ్డు రకాల ధాన్యం ఆరబెట్టుకుని అనంతరం వాటిని ఇంటికి తరలించుకుంటున్నారే తప్ప మార్కెట్‌లో ఏర్పాటుచేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలలో గింజ కూడా విక్రయించలేదు.

వాతావరణం ప్రభావంతోనే ధాన్యం విక్రయాలు



మబ్బులు పట్టిన వాతావరణంతో ఆందోళన పడాల్సి వస్తోంది. వర్షాలు పడితే గింజలు నల్లగా మారి ఇబ్బందులు పడతాం. ఈ భయంతోనే మిల్లర్లకు ధాన్యాన్ని విక్రయిస్తున్నాం. పచ్చిధాన్యాన్నే మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా మిల్లర్లు రూ.2100కి కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

గుండు వెంకటేశ్వర్లు, రైతు, హుజూర్‌నగర్

ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలి



రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి. సన్నాలు, దొడ్డు రకాలు అన్ని కూడా కొనుగోలు చేస్తాం. మిల్లులకు విక్రయించడం వల్ల రైతులకు మద్దతు ధర, బోనస్ లభించదు. రైతులు ఆలస్యమైనా తేమ శాతం 17లోపు వచ్చేలా చూసుకుని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి.

శ్రీనివాసులు, ఆర్డీవో,

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి



ప్రభుత్వం, మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారు. మద్దతు ధరకు మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలి. సాంబమసూరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం సరికాదు. రైతులు మిల్లులకు ఏపంట తీసుకొచ్చినా వాటిని కొనుగోలుచేయాలి. ఇష్టానుసారంగా తక్కువ ధరకు కొనుగోలుచేసే మిల్లర్లపై కఠినచర్యలు తీసుకోవాలి.

పల్లె వెంకటరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

మంచు కురిసే వేళలో




గత నెలలో భారీ వర్షాలకు తోడు, అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఇంకా వర్షాకాలం అయిపోలేదు అనుకుంటుండగానే రెండు రోజులుగా భారీగా మంచు కురుస్తోంది. నేను వస్తున్నానంటూ శరదృతువు మంచుతో పలుకరిస్తోంది. నల్లగొండ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం మంచు కురుస్తుండగానే ఎన్జీ కళాశాల మైదానంలో ఆటలు ఆడుకుంటున్న యువకులు. ప్రధాన వీధిలో పరుచుకున్న మంచు దుప్పటి.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.20
టీఎంసీలు	301.3570
ఎడమకాల్వకు నీటి విడుదల	9500
కుడికాల్వకు	6556
విద్యుత్ కేంద్రం ద్వారా	12424
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,315 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	31,280 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	41.88 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	1150
అవుట్‌ఫ్లో	4 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.40 అడుగులు
టీఎంసీలు	4.30
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత
ఇన్‌ఫ్లో	662.38 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	44.88 క్యూసెక్కులు

కవి వాసుదేవరావుకు డాక్టరేట్



దేవరకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త, తెలంగాణ సాహిత్య సాంస్కృతిక అధ్యయన వేదిక దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వా వాసుదేవరావుకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ యునివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నాలుగు దశాబ్దాలుగా సాహితీరంగంలో విశిష్ట కృషి చేసినందుకు డాక్టరేట్ అందజేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవి సమ్మేళనాలు, యువకవులచే కవిత సంపుటలు ప్రచురించారు.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండల కేంద్రానికి చెందిన బండి కృష్ణ (19) అదృశ్యమయ్యాడు. బండి వెంకటేశ్వర్లు ఎల్లమ్మ కుమారుడు కృష్ణ ఈనెల 11న ఇంటి నుంచి ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎంత వెతికినా అతని ఆచూకీ లభించలేదు.ఈమేరకు తల్లి ఎల్లమ్మ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైర్ చోరీ

రాజాపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్‌ను దహనం చేసి, అందులోని కాపర్‌వైరును దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. మండలంలోని జాల గ్రామానికి చెందిన మొగిలి వెంకటయ్య, గాజం నర్సింహులు వ్యవసాయల బావుల వద్ద దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను దహనం చేసి, అందులోని కాపర్‌వైర్‌ను చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు.

వరి కొయ్యలు.. కలియ దున్నితేనే మేలు

వరి కొయ్యల దహనంతో భూసారం కోల్పోతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. దీంతోపాటు భూమిలో ఉన్న పలు రకాల పోషకాల సారం తగ్గుతుంది. కొయ్యలకు నిప్పు పెట్టే బదులు, వాటిపై సూపర్ పాస్పేట్ చల్లితే 15రోజుల్లో కొయ్య మురిగి భూమికి పోషకాలు అందుతాయి. దీంతో ఎరువుల ఖర్చు తగ్గి రైతులకు పెట్టుబడి ఆదా అవుతుంది. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకుంటే పంటల ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చు.

- (ఆంధ్రజ్యోతి-గుండాల)



వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న దృశ్యం

రైతులు ప్రస్తుతం రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వానాకాలం పంటకు వరికోత మిషన్లతో కోతలు చేపట్టిన రైతులు పొలంలో ఉన్న వరి కొయ్యలను దహనం చేస్తున్నారు. దీంతో విపరీతమైన వేడివల్ల భూసారం కోల్పోతుందని, దీనివల్ల నష్టం వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ కొంత మంది రైతులు వరి కొయ్యలు దహనం చేస్తుండడంతో నేలలోని నత్రజని, పాస్పరస్ వంటి పోషకాల సారం తగ్గుతుందని పేర్కొంటున్నారు. జిల్లాలోని 17 మండలాల్లో సుమారు 2,59,498 ఎకరాల వరి పంటను సాగు చేశారు. దీంతో రైతులు హార్వెస్టర్లతో కోయించగా, పొలాలు దిగబడుతుండడంతో కర్ర పైకి కోస్తున్నారు. ఈ వరి కొయ్యలతో దున్నడం వల్ల కల్టివేటర్‌కు ఇబ్బందిగా ఉండడం, కొయ్య త్వరగా మురగదనే ఉద్దేశంతో ఎక్కువ మంది రైతులు వరి కొయ్యలు కాల్చడానికి సిద్ధమై యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు.

నష్టాలెన్నో..

నైట్రోజన్ పాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరవుతాయి. తద్వారా భవిష్యత్ పంటల కోసం అందుబాటులో ఉండవు. కొయ్యలు కాల్చడంవల్ల గాలిలో కలుషితం ఏర్పడి ఊపిరితిత్తుల సమస్యకు దారితీస్తుంది. కొన్నిరకాల కీటకాలు పెరిగి వ్యాధులకు నివాసాలుగా మారుతాయి. మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని భూసారం కోల్పోతుంది. నీటినిల్వ సామర్థ్యం తగ్గి భవిష్యత్ పంటల సాగుకు ఎక్కువ నీరు కావాల్సి ఉంటుంది. వరికొయ్యలను కాల్చకుంటే భూసారం మెరుగై పర్యావరణ పరిరక్షణ సమతులంగా ఉంటుంది.

కొయ్య పెద్దగా ఉండడంతో..



వరికోత మిషన్లు దిగబడకుండా ఉండేందుకు పైకి కోయాల్సి వస్తుంది. దీంతో కొయ్య మురగక పోవడంతో తప్పడంలేదు. రబీ లో సమస్య ఉండడం లేదు. వానాకాలం వరి కోసినప్పుడు సమస్య ఉంటుంది. కొంత మంది రైతులకు అవగాహన లేకపోవడంతో కూడా కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

- వల్లాల లింగస్వామి, బురుజుబావి

అవగాహన కల్పిస్తున్నాము



రైతులకు వరి కొయ్యలు కాల్చివేతపై అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ కొంత మంది రైతులు కొయ్యను కాల్చివేస్తున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించినట్లయితే రైతులకు సాగు ఖర్చు తగ్గడంతోపాటు దిగుబడి కూడా పెరుగుతుంది. రైతులకు ఎలాంటి సమస్యలున్నా మమ్మల్ని సంప్రదించాలి. రబీ సాగులో రైతులు జింక్‌ను వాడితే పంటలకు ఎంతో మేలు జరుగుతుంది.

- క్రాంతి, ఏఈవో, గుండాల

వరి కొయ్యలు దున్నకంతోనే ప్రయోజనాలెన్నో..

వరి కొయ్యలను కలియ దున్నడంవల్ల సేంద్రియ కార్బన్ శాతం పెరిగి సుమారు 10 శాతం వరకు దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. దుక్కి దున్నేటప్పుడు సూపర్ పాస్పేట్ చల్లితే రెండు వారాల్లో కర్ర మురిగి పోషకాలుగా మారుతాయి. దీంతో డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. దీంతో ఖర్చులు ఆదా అవుతాయి. కలియ దున్నితే ఎకరాకు టన్ను ఎరువు తయారవుతుంది. కలియ దున్నడం వల్ల జింకు, మాంగనీస్, ఇనుము, కాల్షియం తయారై పంటకు మేలు చేస్తాయి.

వరి కొయ్యకాలు తగులబెట్టవద్దు : ఏడీఏ

మిర్యాలగూడ : వరి కోతలు పూర్తయిన తదుపరి రైతులు కొయ్యకాలు తగుల బెట్టకూడదని మిర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులు దేవ్‌సింగ్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరికొయ్యలు తగుల బెట్టడం వల్ల నైట్రోజన్, పాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరై భవిష్యత్‌లో పంటలకు అందుబాటులో ఉండవన్నారు. కార్బన్‌డైఆక్సైడ్ ఉత్పన్నమై వాయుకాలుష్యం ఏర్పడి ప్రజలకు శ్వాసకోస వ్యాధులు ప్రబలుతాయన్నారు. భూమిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని జీవ వైవిధ్యం దెబ్బతింటుందన్నారు. నేలలో నీటిసామర్థ్యం తగ్గి భవిష్యత్ పంటలకు నీటిఎద్దడి ఏర్పడుతుందన్నారు. కొయ్యకాలు కాల్చకుండా భూసారం కాపాడుకునేలా జాగ్రత్తలు పాటించాలన్నారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకన్న



భూదాన్‌పోచంపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు లచ్చుమల్ల వెంకన్న ఎన్నికయ్యారు. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన లచ్చుమల్ల వెంకన్న విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, సామాజిక సేవలో ముందుండేవాడు. శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికల్లో ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు.

యాదగిరి క్షేత్రంలో కార్తీక సందడి

- దేవదేవుడి దర్శనానికి 46వేల మంది భక్తుల రాక
- వ్రతపూజల్లో పాల్గొన్న 1,832మంది దంపతులు



ఆకాశ దీపారాధనకు ముందు ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు సత్యదేవుని వ్రతాలు, మహిళా భక్తులు కొండపైన (ప్రధానాలయం ఉత్తర దిశ, శివాలయం) రెండు చోట్ల, కొండకింద (లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠ ద్వారం) మూడు చోట్ల కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 5.30 గంటలకు మొదటి విడత ప్రారంభం కాగా 7 గంటలకు ఎనిమిది విడతలుగా ప్రతి రెండు గంటలకొకసారి సత్యదేవుని వ్రతాలు జరిపించగా మధ్యాహ్నం వరకు 1,300పైచిలుకు దంపతులు వ్రతాలు ఆచరించారు. వ్రత మండపాలకు వేకువజాము నుంచి భక్తులు చేరుకోగా పూజల టికెట్ల కోసం భక్తులు పోటీపడగా వ్రత మండపం టికెట్ కౌంటర్ వద్ద భక్తులతో కిక్కిరిసింది. ఎనిమిది విడతల్లో 1,832 జంటలు సత్యదేవుని వ్రతాల్లో పాల్గొన్నాయి. గత ఏడాదితో పోల్చితే 64జంటలు అధికంగా వ్రతాల్లో పాల్గొన్నా యి. పాతగుట్టలోనూ 258జంటలు వ్రతాల్లో పాల్గొన్నాయి. లక్ష్మీనారసింహ దివ్యక్షేత్రంలో అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి పూజారులు భక్తులతో రుద్రాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రా భిషేకాలు, స్పటిక లింగానికి బిల్వార్చనలు చేయించారు. 46వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. ప్రధానాలయ ఉభయ క్యూలై న్లు భక్తుల రద్దీతో కిక్కిరిసిపోగా వీఐపీ టికెట్ దర్శనానికి గంట సమయం, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కాగా ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.51,22,947ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు.



యాదగిరిగుట్ట కొండ కింద సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న జంటలు

చెర్వుగట్టులో విశేష పూజలు

నార్కట్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలిం గేశ్వర స్వామి దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక పౌర్ణమి కావడంతో తెల్లవారు జామునుంచే భక్తుల రాక మొదలైంది. జిల్లా నుంచే కాకుండా హైద్రాబాద్ ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. గుట్టపైన గుట్ట కింద పార్వతీ మాత ఆలయం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి వేడుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు పోతుల పాటి రామలింగేశ్వర శర్మ, వేద పండితులు ప్రముఖులకు వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. జిల్లా మొదటి శ్రేణి న్యాయమూర్తి శిరీష, మొబైల్ కోర్టు న్యాయమూర్తి సౌందర్య, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ దంపతులు ఉన్నారు.



రామలింగేశ్వరుడిని దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తులు

కేటీఆర్ కుట్రపూరిత రాజకీయాలు: ఎమ్మెల్యే వీరేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుంటే మాజీ మంత్రి కేటీఆర్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను బద్నాం చేసేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాలుగా మంత్రి పదవిలో ఉన్న కేటీఆర్ కనీస విలువ లు లేకుండా మాట్లాడటం సరైంది కాదన్నారు. కొడంగల్, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఆ నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. లగచర్ల ఘటనలో కేటీఆర్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి సూచనలు ఇచ్చి జిల్లా కలెక్టర్‌పై దాడి చేయించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ నిర్వాసితులను ఎంతో ఇబ్బందులు పెట్టారని, మల్లన్నసాగర్, కొండ పోచ మ్మ భూ నిర్వాసితులకు ఇంతవరకు నష్టపరిహారం అందించలేదన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ ఫైనా న్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, ఆరు గ్యారెంటీల మెనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ గాజుల సుకన్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, చెవుగోని శ్రీను, యాసారపు వెంకన్న, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మంగినపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు: డీఎం

యాదగిరిగుట్ట రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామ క్షేత్రాలు అమరావతిలోని అమరలింగేశ్వరస్వామి, భీమవరం సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరలింగేశ్వరస్వామి, ద్రాక్షారామం భీమేశ్వరస్వామి, సామర్లకోట భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు యాదగిరిగుట్ట నుంచి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నామని డీఎం బండారపు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 17, 24 తేదీల్లో, ప్రతీ ఆదివారం సాయంత్రం 5గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరతాయన్నారు. ఒక్కరోజులోనే దర్శనం చేసుకోవచ్చన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుచార్జీలు, పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1300గా నిర్ణయించామని, బుకింగ్ కోసం 98851 03165, 7382835016 నంబర్లను సంప్రదించి ముందుగా టికెట్‌బుక్ చేసుకున్నవారికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు.

రైతు నెత్తిన ధరల పిడుగు

(5వ పేజీ తరువాయి)

ధరలు మూడు కిలోల సంచికి రూ.200 నుంచి రూ.500 వరకు పెరిగాయి. దేశవాళి వంగడాల ధరలు మాత్రం బ్యాగుకు (30 కిలోలు) రూ.50 పెరిగింది. డీఏపీ బస్తాపై రూ.300, 20-20-0-13 బస్తాపై రూ.100 పెరిగాయి. ఎక్కువ మంది రైతులు కావేరి-468 వరి విత్తనాలు అడుగుతుండటంతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో రైతులపై రూ.54.27 కోట్ల అదనపు భారం

రబీలో వరి విత్తనాలు, డీఏపీ ధరలు పెరగడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులపై రూ.54.27 కోట్ల అదనపు భారం పడనుంది. నల్లగొండ జిల్లా 5.56లక్షల ఎకరాలు, సూర్యాపేట జిల్లా సుమారు 4లక్షల ఎకరాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2.98 లక్షల ఎకరాల చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 12.54 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా. సుమారు ఆరు లక్షల ఎకరాల్లో హైబ్రీడ్ వరి వంగడాలు సాగు చేస్తారనుకున్నా ఒక్కో విత్తనాల ప్యాకెట్‌పై సగటున రూ.300 చొప్పున లెక్కించినా రూ.18కోట్లు, మిగతా 6.54లక్షల ఎకరాల్లో దేశవాళీ రకాలు సాగు చేసినా బస్తాకు రూ.50చొప్పున రూ.3.27కోట్లు విత్తనాలపై అదనపు భారం పడుతుంది. 3.54 లక్షల ఎకరాలకు ధర పెరగని కాంప్లెక్స్ ఎరువులు వాడినా 9లక్షల ఎకరాలకు డీఏపీ లేదా, 20-20-0-13 ఎరువులు వాడుతారు. ఎకరాకు రెండు బస్తాల చొప్పున డీఏపీ లేదా ఇతర కాంప్లెక్స్ ఎరువులు వేస్తారు. లక్ష ఎకరాలకు డీఏపీ పాత స్టాక్ దొరికినా, 5లక్షల ఎకరాలకు ఎకరాకు రెండు బస్తాలకు రూ.600 చొప్పున రూ.30కోట్లు, 3లక్షల ఎకరాలకు 20-20-0-13 వేస్తే బస్తాకు రూ.100 చొప్పున రూ.3కోట్లు అదనపు భారం పడుతుంది. ఇలా ధరల పెరుగుదలతో ఉమ్మడి జిల్లా రైతులపై రూ.54.27 కోట్ల అదనపు భారం పడుతుంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించేప్పుడు పావలా పెంచితే వెంటనే ధరల రూపేణా రూపాయి భారం మోపుతున్నదని రైతులు విమర్శిస్తున్నారు. తమకు మద్దతు ధర కాకుండా గిట్టుబాటు ధర ఇచ్చినప్పుడే తమ కుటుంబాలు బాగుపడతాయని రైతులంటున్నారు.



హైబ్రీడ్ వరి రకం	గతంలో ధర	ఈ సీజన్‌లో ధర
వీఎన్‌ఆర్ 228	900	1100
కావేరి 468	1100	1500
బయోసీడ్	900	1200
మహేంద్ర 3030	900	1100
రాశి 3366	900	1200
దేశవాళి వంగడాలు	1050	1100
డీఏపీ ఎరువు బస్తా	1350	1650
20-20-0-13	1200	1300

ధరలైనా తగ్గించాలి లేదా మద్దతు ధరైనా పెంచాలి



ప్రతి సంవత్సరం పంటల సాగు ఖర్చు పెరుగుతోంది. పెరిగిన ఖర్చుకు తగినట్లు కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర పెంచడంలేదు. పైగా రూ.100, రూ.200 పెంచి మద్దతు ధర ప్రకటించిన వెంటనే ఎరువులు, విత్తనాలు ధరలు రూ.300 నుంచి రూ.400 పెంచుతున్నారు. కాలం అనుకూలించక, ఆశించిన దిగుబడులు రాక ఇప్పటికే నష్టాల పాలవుతున్నాం. ఈ యాసంగిలో విత్తనాలు, డీఏపీ ధర పెరగడంతో మరింత నష్టం వాటిల్లుతుంది. వెంటనే పెంచిన ధరలైనా తగ్గించాలి లేదా మద్దతు ధర అయినా పెంచాలి.

కొండ సోమల్లు, రైతు, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

● కిటకిటలాడిన శివాలయాలు ● సామూహిక వ్రత పూజలు ● దీపారాధనలు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న యువతులు


హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

జిల్లా వ్యాప్తంగా ప్రజలంతా శుక్రవారం కార్తీక పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాలు భక్తులతో పోటె త్తాయి. భువనగిరిలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటే శ్వర్లు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్యాంసుందర్ పాల్గొన్నారు. భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామ శివారులోని త్రిలింగే శ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, క్యామ మల్లేశం , దూదిమెట్ల బాలరాజు యాదవ్, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ పూజల్లో పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లిలో జలదీపోత్స వాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కీర్తిరెడ్డి ప్రారంభిం చారు. వలిగొండ మండలం సంగెంలో భీమలింగేశ్వరుడి అభి షేకానికి భక్తులు బారులుదీరారు. ఆలేరు మండలం కొలను పాక సోమేశ్వరాలయంలో పూజలు కొనసాగాయి. బీబీనగర్ మండల అక్కన్నమాదన్న ఆలయాల్లో భక్తులు కిటకిటలా డారు. సంస్థాన్‌నారాయణపూర్ మండలం చిల్లాపురంలో జాతర కొనసాగింది.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


వలిగొండ మండలం సంగెం భీమలింగేశ్వరంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు


తుర్కపల్లి: పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


భూదాన్‌పోచంపల్లి: జలదీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కీర్తిరెడ్డి


భువనగిరి రూరల్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

సమాచారం

నేడు నల్లగొండ జిల్లాకు డెడికేటెడ్ కమిషన్ రాక

నల్లగొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై వివిధ సంఘాల నుంచి దరఖాస్తుల స్వీకరణతో పాటు ప్రజాభిప్రాయ సేకరణకు శనివారం డెడికేటెడ్ కమిషన్ నల్లగొండ జిల్లాకు రానుందని ఆ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి సైదులు ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారన్నారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కుల సంఘాలు, ఇతర కుల సంఘాలు, ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓపెన్ ఫోరం సమావేశం

రాజాపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 04-14-2023 నుండి 31-3-2024 వరకు మండలంలో ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనులపై ఈ నెల 16న ఓపెన్‌ఫోరం సమావేశం ఉంటుందని ఎంపీడీవో నాగవేణి తెలిపారు. సోషల్ ఆడిటర్ బృందం గత వారంలో మండలోని పర్యాటించి పనుల వివరాలు సేకరించాలన్నారు. ఓపెన్‌ఫోరం సమావేశానికి రైతులు, కూలీలు సహకాలంలో హాజరుకావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● మృతదేహంతో బంధువుల రాస్తారోకో


చిర్రగూడూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

అడ్డగూడూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. సీఐ వెంకటటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన కమ్మంపాటి అంజయ్య (57) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం టీవీఎస్ మోటార్ సైకిల్‌పై అంజయ్య తన భార్య పున్నమ్మతో కలిసి శాలిగౌరారం మండలంలో తన చిన్న కూమార్తె వద్దకు వెళ్లి సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. చిర్రగూడూరు గ్రామ స్టేజీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ ఫోకస్‌కు కళ్లు సరిగ్గా కనిపించక వలిగొండ-తొర్రురు రహదారిపై రోడ్డు పనులు చేసున్న వ్యక్తిని అంజయ్య మోటారు సైకిల్ తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అంజయ్యకు కింద పడగా ... అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి .అక్కడికక్కడే మృతి చెందాడు. అంజయ్య భార్య పున్నమ్మకు స్వల్ప గాయాలుయ్యాయి. రోడ్డు పనులు చేస్తున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అంజయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం అంజయ్య కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామాస్థులతో మృతదేహంతో వలిగొండ- తొర్రురు రహదారిపై 2గంటల పైగా రాస్తారోక నిర్వహించారు. బాధిత కుటుబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్డు ప్రమాదానికి రోడ్డు ప నులు చేయిస్తున్న కాంట్రాక్టరే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరువైపుల వాహనాలు భారీగా నిలిచిపోయాయి అడ్డగూడూరు ఎస్.ఐ నాగరాజు పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షించారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసుధన్‌రెడ్డి, రామన్నపేట సీఐ వెంకటటేశ్వర్లు సంఘటన స్థలాన్నికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించి అంజయ్య కుటుంబసభ్యులు, బంధువులతో, గ్రామపెద్దలతో మాటాడి మృతుడికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

రాజాపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో, మద్యానికి భానిస అయ్యి ఓ యువకుడు శుక్రవారం బావిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉపేందర్ నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. రాజాపేటకు చెందిన మేకల వెంకటేష్ (30) డ్రైవింగ్ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా కుటుంబ మనస్పర్థలు రావడంతో భార్యతో తరచూ గొడవ పడుతుండేవారు. గొడవ విషయంపై అత్తమామ సర్దిచెప్పి తమ కుమార్తెను తమ వెంట తీసుకుని వెళ్లారు. దీంతో వెంకటేష్ మనస్తాపానికి గురి చెంది మరింత మద్యానికి బానిసయ్యాడు. ఎప్పడిలాగా మద్యం తాగి గత మంగళ వారం రాత్రి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారుజామున తల్లిదండ్రులు చూడగా కనిపించలేదు. దీంతో తెలసిన ప్రదేశంలో, బంధువుల ఇండ్లలో ఫలితం లేక పోయింది. కాగా శుక్రవారం రాజాపేట దాచేపల్లి రాజు వ్యవసాయ బావిలో మృతదేహం ఉందని సమాచారం మేరకు పోలీసులు వెళ్లి చేశారు. మేకల వేంకటేష్‌ను గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉపేందర్ నాయక్ వివరించారు.

విశ్వబ్రాహ్మణ కుల నామాన్ని చేర్చాలి

రామన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణ కుల నామాన్ని చేర్చాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వరాచారి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అవమానపరిచే విధంగా కులంపేరు ప్రస్తావన లేకుండా సర్వేఫామ్‌లో కేవలం వృత్తులకు కోడులు కేటాయించి వర్గీకరణ చేపట్టడం శోచనీయమాన్నరు. కులప్రాదికన బీసీ కమీషనర్ బీసీ (బి)సీరియల్ నెంబర్ 21 లో విశ్వబ్రాహ్మణాలు చేర్చినటువంటి ప్రభుత్వం కులగణన సర్వేలో మాత్రం విశ్వబ్రాహ్మణ పదం తొలగించడం సమంజసం కాదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇట్టి సర్వేఫారంలో వృత్తినామాలను తొలిగించి విశ్వబ్రాహ్మణమనే పదాన్ని చేర్చి ఒకే కోడును కేటాయించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న ఏకేఆర్ ఫౌండేషన్ సభ్యులు

వలిగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్వర్తి గ్రామానికిచెందిన ఎడవెళ్లి మీనమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా వారి కుటుంబసభ్యులకు ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సౌజన్యంతో రూ. 5వేల ఆర్థిక రూపాయల సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సురమాంబ కల్యాణం


సంస్థాన్‌నారాయణపురం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం సురమాంబ- కంఠమహేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అంతకు ముందు సీతారామ చంద్ర స్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా వచ్చిన ఉత్సవ మూర్తుల విగ్రహాలకు ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరగా ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు చింతకింది అంజయ్య, ఉపాధ్యక్షుడు చెవగోని వెంకటేశం, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కాంగ్రెస్ పట్టణ ఇంచార్జ్ మొగుదాల రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, కౌన్సిలర్‌లు ఎస్.విజయ, బొడిగె అరుణ, పి. శ్రీధర్ బాబు , ఊడుగు రమేష్ పాల్గొన్నారు. కాగా, శనివారం కాటమయ్య బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు గౌడ సంఘం అధ్యక్షుడు చింతకింది అంజయ్య తెలిపారు.


చౌటుప్పల్‌లో కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకుడు

సంస్థాన్‌నారాయణపురం: మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో కంఠమహేశ్వర స్వామి సురమాంబల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, గీత పనివారల సంఘం జాతీయ అధ్యక్షుడు బొమ్మగోని ప్రభాకర్ గౌడ్ తదితరులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ. ఉత్సవాలలో శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు రాపర్తి కరుణాకర్, గౌడ సంఘం అధ్యక్షులు బద్దం యాదయ్య, గీత పనివారాల సంఘం అధ్యక్షుడు నీళ్ల గాలయ్య ,మోగుదాల సత్తయ్య, పాల కుర్ల యాదయ్య, మారగొని వెంకటేష్, పాలకూర సతీష్, నీళ్ల రాజు, దూసరి వెంకటేష్, నీళ్ల శ్రీశైలం, బొమ్మని రఘు, రాపర్తి సురేష్. లింగస్వామగౌడ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

● రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రామన్నపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మలగూడెం గ్రామంలో ఐకేపీ మరియు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తేచ్చే ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రైతుల వివరాలు ఎప్పడికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా, లేదా అని రిజిస్టర్‌ను చూశారు. తూకం వేసిన వెంటనే ధాన్యాన్నిప మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డేటాఎంట్రీ ఆపరేటర్లు రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొనుగోలు ఎలా జరుగుతుందని ఆరా తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్‌బహదూర్, సీనియర్ అసిస్టెంట్ అంజయ్య పాల్గొన్నారు.


ధాన్యం రాసులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమగ్రాభివృద్ధికోసం పోరాటం


కార్యకర్తలతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

వలిగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికోసం సమరశీల పోరాటాలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పుల్లిగిల్ల గ్రామంలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ఆవిర్భవించి 8సంవత్సరాలు అయినా అనేక ప్రజాసమస్యల పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు. వ్యవసాయయే జీవన ఆధారంగా ఉన్న జిల్లాలో అనేక మంది చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు సరైన సాగునీటి వసతులు లేక సతమతమౌతున్నారని అన్నారు. జిల్లాలోని బస్వాపూర్ ప్రాజెక్టు నిర్మాణం, పాలమూరు,రంగారెడ్డి, ఎత్తిపోతల పథకం, గంధమల్ల రిజర్వాయర్ పనులు నత్తనడకలో సాగుతున్నాయనిన్నారు. బునాదీగాని పిల్లాయిపల్లి కాల్వకు నిధులు విడుదల చేశారని ప్రభుత్వం వెంటనే క్వాలల మరమ్మతులు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, సీనియర్ నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు ఆరోగ్య రక్షకులు


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రమోద్‌కుమార్

భువనగిరి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు ప్రజల ఆరోగ్య రక్షకులని పీసీసీ ప్రధాన కార్యదర్శి, మునిసిపల్ కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్ అన్నారు. భువనగిరిలోని 10,25,26,28 వార్డులలో పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులకు శుక్రవారం ఆయన దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు. పట్టణ అభివృద్ధిలో కార్మికుల సేవలు అమోఘమైనవి వారిని గౌరవించాల్సిన భాధ్యత అందరిదన్నారు. మునిసిపల్ కార్మికులకు గత వైయస్సార్ ప్రభుత్వం హాయం నుంచే ట్రెజరీ ద్వారా వేతనాలు అందుతున్నాయని, ప్రస్తుత కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాల రెగ్యులరైజేషన్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ద్వారా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, నాయకులు మాటూరి బాలేశ్వర్, పలుగుల ఆగేశ్వర్‌రావు, రత్న రాజశేఖర్, బింగి నరేష్, పాలడుగు శేఖర్, భూపాల్‌రెడ్డి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలు

భువనగిరి గంజ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణంలోని హజ్రత్ సయ్యద్ హబీబ్ ఉల్ హసిన్ హాజీ ఉల్ హర్మైన్ 495 ఉర్స్ షరీఫ్ దుర్గా ఉర్సులో భాగంగా ఊరేగింపు శుక్రవారం వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హైదారాబాద్‌కు చెందిన ఎంఐఎమ్ ఎమ్మెల్యే మీర్జా రహేమత్ బిగ్ ఖాద్రి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. భువనగిరి పట్టణంలోని మస్జిద్‌ఇ ఉస్మానియా ఇస్లాంపుర, సమ్మర్, హైదారాబాద్ చౌరస్తా మీదుగా దర్గా షరీఫ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ముతవల్లి మహ్మద్ షంషీర్ ఆలీ, అమ్జద్ ఆలీ ఉన్నారు.


చాదర్ సమర్పిస్తున్న భక్తులు

అమరుల స్ఫూర్తి కొనసాగించాలి

భువనగిరి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత కోసం అమరుల స్ఫూర్తిని కొనసాగించాలని డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని నెహ్రూ యువకేంద్రం, నవభారత్ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన జన జాతీయ గౌరవ దివస్‌లో ఆయన మాట్లాడారు. బిర్సా ముండా ఆశయాలను కొనసాగించాలని అన్నారు. స్కిల్ కాంపిటేషన్, సెమినార్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కరుణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

తాటి,ఈత చెట్ల ధ్వంసం చేయడం అమానుషం


మాట్లాడుతున్న కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమణ

చౌటుప్పల్ టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తాటి, ఈత చెట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేస్తుండడంతో గీత కార్మికుల ఉపాధి దెబ్బ తింటుందని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి. రమణ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్టాన్ని ధిక్కరించి తాటి, ఈత చెట్ల ను ధ్వంసం చేయడం అమానుషమని ఆయన అన్నారు. సమావేశంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాగీరు కిష్టయ్య, నాయకులు బత్తుల లక్ష్మయ్య, చీకూరి ఈదయ్య, అంతటి అశోక్ పాల్గొన్నారు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


సృజనను కలిసిన రాష్ట్ర నాయకులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్ అండ్ ఆర్‌డీ శాఖ నూతన డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సృజన అన్నారు. శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను మర్యాద పూర్వకంగా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూలగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు అనంతరావు, ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్‌కుమార్, నాయకులు యుగేంధర్, విక్రమ్, రవిప్రకాష్, విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మోత్కూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను రిటైర్డు ఉద్యోగ కుటుంబాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. శుక్రవారం ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం మోత్కూరు యూనిట్ ఆధ్వర్యంలో మెడివిజన్ కంటి ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఐదుగురిని శస్త్ర చికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బద్దం యాదిరెడ్డి, ఆకవరం వల్లభాయ్, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మర్రి ఆనందం, పట్వారి అంజయ్య, సుబ్రహ్మణ్యశర్మ, గాదె వెంకటేశ్వర్లు, అంజయ్య, భిక్షం పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

భువనగిరి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం హన్మాపురం గ్రామ శివారులో శుక్రవారం పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భువనగిరి పట్టణానికి చెందిన ప్రవీణ్, అశోక్, బొమ్మలారామారం మండలానికి చెందిన సురేశ్, చాణిక్య రెడ్డి, మహేశ్‌మండలంలోని హన్మాపురం సబ్ స్టేషన్‌కు వెళ్లే దారిలో బహిరంగ ప్రదేశంలో పేకాడుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.26,400 నగదు 5సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి గంజ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరనలో భాగంగా బొ మ్మాయిపల్లి అండర్పాస్ నుండి సింగన్న గూడెం వరకు 33కేవి లైన్స్, 11కేవి లైన్స్, ఎల్టి లైన్స్ టవర్స్ మీదికి లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతాయి. అయితే బుధవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు భువనగిరి పట్టణంలో హౌసింగ్‌బోర్డు కాలనీ, నేషనల్ హైవేకి ఎడమవైపు గల పవన్ మోటర్స్ షోరూం, ఇరువైపుల కమర్షియల్ షాప్స్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.